క్లుప్తంగా

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన అడిషనల్ డీసీపీ



ఎస్సై వెంకటేష్‌కు సూచనలు చేస్తున్న అడిషనల్ డీసీపీ ప్రసాదరావు

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను శనివారం రాత్రి అడిషనల్ డీసీపీ జి.ప్రసాదరావు, మధిర సీఐ మధుతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేసి.. రికార్డులను పరిశీలించారు. స్టేషన్ ఏరియా అంతటా కలియతిరిగారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకటేష్‌కు పలు సూచనలు చేశారు. ఫిర్యాదులపై తక్షణ విచారణ చేపట్టాలన్నారు. అంతరాష్ట్రం నుంచి వచ్చే వాహనాల తనిఖీ ముమ్మరం చేయాలన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోండి



మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్

సత్తుపల్లిటౌన్: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని 6వ అదనపు జిల్లా జడ్జి ఎం.శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో శనివారం జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, బాల్య వివాహాల రద్దు చట్టాల గురించి వివరించారు. సీనియర్ సివిల్ జడ్జి షేక్ మీరాఖాసీంసాహెబ్ మాట్లాడుతూ పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. సమావేశంలో సీఐ టి.కిరణ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తేళ్లూరి ఆడమ్స్, సెక్రటరీ రమేష్, అబ్దుల్ బాషా, సాధు కృష్ణ, విజయ్‌కుమార్, అరుణ పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా నాగేశ్వరరావు

వేంసూరు: వేంసూరు ఎంపీడీఓ జి.రమేష్ ఇటీవల పదవీ విరమణ అయ్యారు. ఈ క్రమంలో వేంసూరు మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా సత్తుపల్లి ఎంపీడీఓ చిన్న నాగేశ్వరరావు శనివారం బాధ్యతలు చేపట్టారు.

ఇందిరా డెయిరీపై సమీక్ష

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని పశువైద్య శాఖ కార్యాలయంలో శనివారం ఇందిరా డెయిరీపై ఐకేపీ ఏపీఎం కె.వెంకటేశ్వర్లు, సిబ్బంది, పశువుల ఆస్పత్రి డాక్టర్ వంశీ సంయుక్తంగా సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో ప్రస్తుతం ఉన్న పాడి గేదెల వివరాలను సేకరించారు. ఇందిరమ్మ డెయిరీ ద్వారా గేదెల కొనుగోలుకు ఆసక్తి ఉన్న వారి వివరాలపై చర్చించారు. ఈ సమావేశంలో ఐకేపీ సీసీలు రమాదేవి, శాంతకుమారి, లత, వెంకట్రామిరెడ్డి, కృష్ణారెడ్డి, వెటర్నరీ సిబ్బంది కిరణ్, వెంకటనారాయణ తదితరులు ఉన్నారు.

ఎంపీని కలిసిన కాంగ్రెస్ నాయకులు

ఏన్కూరు: ఖమ్మం ఎంపీ రామసహాయం రెడ్డిని ఏన్కూరు కాంగ్రెస్ నాయకులు శనివారం కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఖమ్మం జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, స్వర్ణ నరేందర్, నాగేశ్వరావు, ధర్మారావు పాల్గొన్నారు.

కాకర్లపల్లిలో ఉచిత వైద్య శిబిరం

సత్తుపల్లిరూరల్: ఈ వర్షాకాలం సీజన్‌లో వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గంగారం పీహెచ్‌సీ వైద్యుడు అవినాష్ అన్నారు. శనివారం మండలంలోని కాకర్లపల్లిలో ఎస్సీ కాలనీలో గంగారం పీహెచ్‌సీ ఆధ్వర్యాన రోగులను పరీక్షించారు. మందులు పంపిణీ చేశారు. జాతీయ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు టీకాలు వేశారు. అనంతరం స్థానిక పంచాయతీ కార్యాలయంలో తహసీల్దార్ యోగేశ్వరరావు, ఎంపీడీఓ చిన్న నాగేశ్వరరావులు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ నర్సింహారావు, ఏఎన్ఎంలు పద్మ, మంజుల, ఈఓఆర్డీ కృష్ణయ్య, పంచాయతీ కార్యదర్శి సీహెచ్ చైతన్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా

కారేపల్లి: కారేపల్లి విశాల సహకార పరపతి సంఘం (సొసైటీ)లో యూరియా అందుబాటులో ఉన్నట్లు సొసైటీ కార్యదర్శి బొల్లు హన్మంతరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 800ల యూరియా బస్తాలు రైతులకు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆధార్ కార్డుతో సొసైటీ కార్యాలయానికి నేరుగా వచ్చి కొనుగోలు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 91772 - 36912 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

అక్రమమా.. సక్రమమా..?!



కొత్తూరులో నిర్మిస్తున్న ప్రైవేట్ గోడౌన్

- గోడౌన్ నిర్మాణ పనులు నిలిపివేయాలని నోటీస్
- సర్వే చేసిన అధికార యంత్రాంగం

సత్తుపల్లి: ప్రైవేట్ గోడౌన్ నిర్మాణం వివాద స్పదమైంది. రూ.కోటి విలువైన ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమౌతుందని, అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయని.. ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో ప్రైవేట్ కట్టడాలను నిలిపివేయాలంటూ ఫిర్యాదుల పరంపరతో గోడౌన్ నిర్మాణ పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. సత్తుపల్లి మండలం కొత్తూరు పంచాయతీ రేజర్ల రెవెన్యూ సర్వే నెంబరు 126/1లో సుమారు 7 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, కొంతమంది కుటుంబ సభ్యుల పేర్ల మీద ఎన్నో ఏళ్లుగా అనుభవిస్తున్నారని ఫిర్యాదు అందింది. వీటిలో 59 జీఓ కింద సగానికిపైగా భూములు ఇప్పటికే రిజిస్ట్రేషన్ జరిగి భూమి బదలాయింపు జరిగిందని స్థానికుల నుంచి ఆరోపణలు ఉన్నాయి.

అది ప్రభుత్వ భూమి..

కొత్తూరులో నిర్మిస్తున్న ప్రైవేట్ గోడౌన్ భూమి ప్రభుత్వ భూమిగా సర్వేలో తేలినట్లు తహసీల్దార్ యోగేశ్వరరావు తెలిపారు. దీనికి సంబంధించిన పత్రాలను తీసుకురావాలని నిర్మాణ యజమానులకు చెప్పామని అప్పటి వరకు నిర్మాణాలను నిలిపివేయాలని ఆదేశించినట్లు తెలిపారు.

– యోగేశ్వరరావు, తహసీల్దార్, సత్తుపల్లి

ప్రస్తుతం నిర్మిస్తున్న గోడౌన్ భూమి ప్రభుత్వ భూమి అయినందున అనుమతులు రావని అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. అయితే అట్టి భూమిలో ఎటువంటి భూమి పత్రాలు లేకుండా ఐదు కుంటల్లో ప్రైవేట్ గోడౌన్ నిర్మాణం చేపట్టడం పట్ల స్థానికుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి.

డాక్యుమెంట్లు చూపించండి..

ప్రైవేట్ గోడౌన్ నిర్మాణానికి సంబంధించిన భూమి పత్రాలను చూపించాలని ఒగ్గు విజయలక్ష్మికి కొత్తూరు గ్రామ కార్యదర్శి భార్గవ్ నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులకు సమాచారం అందించామని తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

మొక్కలు నాటి సంరక్షించండి



పాఠశాల ఆవరణలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లిరూరల్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని రక్షించాలని ఎమ్మెల్యే మట్టా రాగమయి, దయానంద్ తెలిపారు. మండలంలోని గంగారం శ్రీదాసరి వీరారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన వనమహోత్సవం సందర్భంగా పాఠశాల విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. వైస్ ఎంపీపీ దాసరి వెంకట్రామిరెడ్డి(చిట్టినాయన) ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా నోట్‌పుస్తకాలు అందించారు. పదిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను వెంకట్రామిరెడ్డి, మధుమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రైజ్‌మని అందజేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో..



కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో మొక్క నాటుతున్న ప్రజాప్రతినిధులు

కల్లూరురూరల్: మండలంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శనివారం సాయంత్రం ప్రజాప్రతినిధుల పదవీకాలం ఈ నెలతో పూర్తి అవుతున్నందున చివరి మండల పరిషత్ సమావేశం పూర్తి కాగానే గుర్తుగా కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బీరవెల్లి రఘు, ఎండీ ఇస్మాయిల్, ఎంపీడీఓ చంద్రశేఖర్, తహసీల్దార్ పులి సాంబశివుడు, ఏఓ రూప, సీడీపీఓ రహీమున్నీసా భేగం, డాక్టర్ నవ్యకాంత్, డాక్టర్ తపస్సుం, పలు శాఖల అధికారులు, ఎంపీటీసీలు ఎస్‌కె కమ్లి, కొండూరు కిరణ్, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా సాగునీరు అందించాలి



లంకాసాగర్ కాలువను పరిశీలిస్తున్న దయానంద్, ఐబీ అధికారులు

పెనుబల్లి: లంకాసాగర్ ప్రాజెక్ట్ పరిధిలోని పంట కాలువలు శుభ్రం చేసి సాగునీరు సక్రమంగా అందేలా చూడాలని ఆయకట్టు రైతులు జిల్లా కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ విజయ్‌కుమార్‌ను కోరారు. ఈ సందర్భంగా దయానంద్ రైతులతో కలసి లంకాసాగర్ ప్రాజెక్టును, కాలువలను పరిశీలించి మాట్లాడారు. కాలువల నిండా జమ్మిగడ్డితో ఉండటం వల్ల నీరు చివరి భూములకు చేరడంలేదని, కాలువలు కూడా తెగిపోయే ప్రమాదం ఉందని, వెంటనే కాలువల మరమ్మతు పనులు నిర్వహించి ఈ వ్యవసాయ సీజన్‌లో సాగునీరు అందేలా చూడాలన్నారు. అలాగే లంకాసాగర్ ప్రాజెక్టుకు మరమ్మతు పనులు కూడా చేపించాలని రైతులు దయానంద్‌ను కోరగా ఆయన వెంటనే స్పందించి నీటి పారుదల శాఖ ఈఈ శ్రీనివాసరెడ్డి, డీఈ రామారావు, ఏఈ కిరణ్‌లతో సంప్రదించి కాలువ పూడికతీత పనుల అంచనాలు తయారు చేసి వెంటనే మరమ్మతు పనులు, పూడికతీత పనులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక రైతులు వంకాయలపాటి వెంకటేశ్వరరావు, కీసర శ్రీనివాసరెడ్డి, రాజబోయిన కోటేశ్వరరావు, ప్రసాద్, ఆనందరావు, బాబురావు, అమర్‌నాద్, దామోదర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపులో బీసీలదే కీలక పాత్ర



మాట్లాడుతున్న శ్రీనివాస్

సత్తుపల్లి: తెలంగాణ రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి బీసీల పాత్ర కీలకమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ అన్నారు. శనివారం సత్తుపల్లిలోని నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సగానికిపైగా 56 శాతం బీసీ జనాభా ఉన్నారని, జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేసినట్లయితే అన్ని రంగాల్లో బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే కులాల వారీగా జనాభా లెక్కలు తీయాలన్నారు. ఆ తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలకు పోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎం.శ్రీనివాస్, యువజన సంఘం నియోజకవర్గ అధ్యక్షులు మరీదు ప్రసాద్, కమలాకర్, వీరివాడ నాగభూషణం, టోపీ శ్రీను, హమీద్, మురళీ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జగ్జీవన్ రామ్ సేవలు మరువలేనివి



మధిర: నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మధిర/ఎర్రుపాలెం: సమాజాభివృద్ధికి భారత తొలి ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అందించిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, మున్సిపల్ కౌన్సిలర్ కోనా ధనికుమార్ తెలిపారు. శనివారం మధిర, ఎర్రుపాలెంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల్లో జగ్జీవన్ రామ్ వర్ధంతి నిర్వహించి.. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వెంకటేశ్వరరావు, వెంకటేశ్వరరెడ్డి, హనుమంతరావు, బాలరాజు, జహంగీర్, రామారావు, ప్రసాదరావు, బాబు, శ్రీను, బాలు నాయక్, లక్ష్మణరావు, రాజీవ్‌గాంధీ, ఇస్మాయిల్, శ్రీనివాసరావు, వెంకటనర్సయ్య, బాబురావు, జనార్దన్, వెంకటరత్నం, క్రిష్ణ, అనీల్‌కుమార్, బాజీ, వెంకటేశ్వర్లు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ, పదోన్నతి ఉపాధ్యాయులకు సన్మానం

వేంసూరు: మండలంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేసి పదోన్నతి పొందిన బి.సత్యనారాయణ, బి.రవికుమార్, పి.శ్రీనివాస్ లతో పాటుగా.. బదిలీ అయిన కె.నిర్మల కుమారిని శనివారం శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. పాఠశాల హెచ్‌ఎం అధ్యక్షతన జరిగిన ఈ సన్మాన కార్యక్రమంలో వేంసూరు కాంప్లెక్స్ హెచ్‌ఎం సీహెచ్.సుధకర్‌రెడ్డి, కరుణకుమారి, సుధాకర్‌రెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

నారాయణపురం గ్రామంలో..



బోనకల్: బదిలీ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

బోనకల్: మండలంలోని నారాయణపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు గోసు శ్రీనివాసరావు, అంజయ్య ఇటీవల బదిలీ అయ్యారు. శనివారం పాఠశాలలో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆ ఉపాధ్యాయులను సన్మానించారు. పాఠశాల ఉపాధ్యాయులు, ఎంఈఓ కొత్తపల్లి వెంకటేశ్వర్లు మండల నోడల్ అధికారి దామాల పుల్లయ్య, యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి గుగులోత్ రామకృష్ణ, ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు గోసు శ్రీనివాసరావు, అంజయ్యల సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పలువురు నాయకులు, గ్రామస్తులు తదితరులున్నారు.

చెట్టును ఢీకొట్టిన బైక్

వైరా/కొణిజర్ల: అదుపుతప్పి ద్విచక్రవాహనం చెట్టును ఢీకొట్టడంతో తల్లీ కొడుకులు తీవ్రంగా గాయపడిన ఘటన వైరా శివారు శాంతినగర్‌లో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. తల్లాడ మండలం పాత మిట్టపల్లి గ్రామానికి చెందిన జల్లి రుక్మిణమ్మ, ఆమె కుమారుడు నాగేశ్వరరావు ద్విచక్రవాహనంపై ఖమ్మం నుంచి మిట్టపల్లి వెళ్తున్నారు. శాంతినగర్ సమీపంలో లారీని తప్పించబోయి అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వాహనం వెనుక కూర్చున్న రుక్మిణమ్మ ఎగిరిరోడ్డుపై పడటంతో తలకు తీవ్ర గాయమై అపస్మారక స్థితిలోకి చేరుకుంది. నాగేశ్వరరావుకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆటోలో ఖమ్మం తరలించారు.

లారీ, ట్రాలీ ఢీ

వైరా: చేపల లోడుతో వెళ్తున్న లారీని మరో ట్రాలీ పక్కనుంచి ఢీ కొట్టడంతో చేపల లోడు ధ్వంసమైన ఘటన వైరాలో శనివారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. ఏపీలోని కోనసీమ గోదావరి జిల్లా ఆకువీడు నుంచి పంజాబ్ రాష్ట్రానికి చేపల లోడుతో వెళ్తున్న లారీని, హైదరాబాద్ నుంచి వైజాగ్‌కు ఓడలకు వేసే లంగర్‌ను తరలిస్తున్న ట్రాలీ వాహనం తగలడంతో చేపల వ్యాన్ పక్కకు ఒరిగిపోయింది. ట్రక్కు పూర్తిగా నుజ్జవడంతో చేపలు పెట్టెలు ధ్వంసమయ్యాయి. ఈ సంఘటనలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. చేపలను మరో వాహనంలోకి తీసి తరలించారు. లారీ డ్రైవర్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంప్ హౌస్ వద్ద ఆపరేటర్‌కు తీవ్ర గాయాలు

తల్లాడ: మండలంలోని గూడూరు మిషన్ భగీరథ నీటిశుద్ధి కేంద్రంలో శనివారం పంప్ హౌస్‌లో వాల్వ్ ఫెయిలై తీవ్రమైన ప్రెజర్ రావటంతో వాల్ రాడ్ తన్ని వేయడంతో ఆపరేటర్ రాచబంటి లక్ష్మణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రెజర్‌కు లక్ష్మణ్ పక్కనే ఉన్న మోటార్‌పై పడటంతో తలకు గాయమైంది. దీంతో అపస్మారక స్థితిలోకి వెళ్లగా లక్ష్మణ్‌ను తొలుత కల్లూరు ఆస్పత్రికి తరలించి.. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు.

పాలస్తీనాకు సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ సంఘీభావం

మధిర: పాలస్తీనాపై ఇజ్రాయిల్ దురాక్రమణను, మారణహోమాన్ని ఖండించాలని, స్వతంత్ర పాలస్తీనా హక్కుకు మద్దతు ఇవ్వాలని కోరుతూ సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో శనివారం మధిర రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద సంఘీభావం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ వైరా డివిజన్ కార్యదర్శి కంకణాల అర్జున్ రావు మాట్లాడుతూ.. 1948 నుంచి ఇజ్రాయిల్ పాలకుల దురాక్రమణ, హత్యాకాండలకు పాలస్తీనా ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పుల్లయ్య, రాకేష్, సురేష్ పాల్గొన్నారు.

మాస్‌లైన్ నాయకుల అరెస్టును ఖండించండి

సత్తుపల్లిరూరల్: మాస్‌లైన్ నాయకుల అరెస్టును ఖండించాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ కల్లూరు డివిజన్ నాయకుడు అమర్లపూడి శరత్ అన్నారు. శనివారం సత్తుపల్లిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ మండల నాయకులు వెంకటేష్, ప్రసాద్, అలివేలు, కేశవరావు, హనుమంతరావు, శ్రీను, చెల్లమ్మ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

పెనుబల్లి: రెండు సంవత్సరాల క్రితం గత ప్రభుత్వ హయాంలో పనిచేసిన పనులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే గ్రామ పంచాయతీలకు విడుదల చేయాలని పెనుబల్లి మండల మాజీ సర్పంచ్‌లు అధికారులకు విన్నవించారు. జీపీ అభివృద్ధికి తాము అప్పులు చేసి పనులు చేశామని, వాటికి సంబంధించిన బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే పెండింగ్ బిల్లులు మంజూరీ చేయాలని శనివారం తహసీల్దార్ గంటా ప్రతాప్‌కు ఎంపీడీఓ అన్నపూర్ణకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు అశోక్ కుమార్, శంకర్, గోవిందరావు, మల్లయ్య, తేజావత్ తావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్రావు, ప్రసాద్, రవి, తాతారావు, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

పంచాయతీలకు నిధులు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

కల్లూరురూరల్: గ్రామ పంచాయతీల అభివృద్ధికి, గ్రామాల్లో మౌళిక సదుపాయాల కల్పనలకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నిధులు మంజూరు చేయాలని కల్లూరు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. శనివారం ఎంపీపీ బీరవెల్లి రఘు అధ్యక్షతన జరిగిన సమావేశంలో గ్రామ పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం తీరిపోయినందున ప్రత్యేక పాలన అధికారులు బాధ్యతలు చేపట్టారని గత ఆరు నెలలుగా గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరు చేయకపోవడం వల్ల ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయని ప్రజా ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాల్లో చిన్నచిన్న పనులు చేపట్టాలన్నా.. నిధులు లేకపోవటం వల్ల పంచాయతీ కార్యదర్శులు అప్పులు చేసి పనులు చేపడుతున్నారని జెడ్పీటీసీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ ఇస్మాయిల్, పలువురు ఎంపీటీసీలు పేర్కొన్నారు. ప్రభుత్వం రైతుబంధు మంజూరు విషయంలో ప్రజాభిప్రాయ సేకరణ చేయడంలో అర్థం లేదని జెడ్పీటీసీ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. వర్షాకాలం అయినందున గ్రామాల్లో పరిశుభ్రత పాటించాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. ఎంపీఓ సురేష్‌బాబు మాట్లాడుతూ గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులకు అన్ని శాఖల సిబ్బంది సహకారం అందించాలని సూచించారు. ఈ సమావేశంలో విద్యుత్ సరఫరాలో తరచు అంతరాయం, మిషన్ భగీరథ నీటి సరఫరాపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో విద్యుత్‌శాఖ, వైద్యశాఖ, పశు సంవర్ధక శాఖ, ఐసీడీఎస్ వాఖ, సాంఘీక సంక్షేమం, రెవెన్యూశాఖలపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పులి సాంబశివుడు, వెటర్నరీ డాక్టర్ మమత, విద్యుత్‌శాఖ సబ్ ఇంజనీర్లు హరీష్, మదన్, డాక్టర్ నవ్యకాంత్, ఐసీడీఎస్ సీడీపీఓ రహీమున్నీసాభేగం, ఏఓ రూప, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నీరు చేరగానే.. చేపల వేట ప్రారంభిద్దాం..



మాట్లాడుతున్న సొసైటీ అధ్యక్షుడు రహీమ్

వైరా: వైరా రిజర్వాయర్‌లో ఆశించిన స్థాయిలో వర్షపు నీరు చేరిన తర్వాత చేపల వేటను ప్రారంభిద్దామని మత్స్యశాఖ సొసైటీ చైర్మన్ షేక్.రహీమ్ అన్నారు. వైరాలోని చేపల సొసైటీలో శనివారం మత్స్య సహకార సంఘ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో నాలుగు మండలలోని 9 గ్రామాలకు చెందిన సుమారు 1,500 మంది మత్స్యకారులు పాల్గొని తమ ఆవేదనను వ్యక్త పరిచారు. ఈ సందర్భంగా రహీమ్ మాట్లాడుతూ.. ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు లేనందున రిజర్వాయర్ నీటిమట్టం పూర్తి స్థాయిలో తగ్గిందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రిజర్వాయర్‌లో చేపలవేట ప్రారంభిస్తే నీరు మొత్తం కలుషితమై పలు గ్రామాల ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉందని వివరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యం, క్రమశిక్షణ అవసరం



విద్యార్థులకు స్కాలర్‌షిప్స్, మెమొంటోలు పంపిణీ చేస్తున్న భాస్కర్‌రెడ్డి, జేడీ లక్ష్మీనారాయణ

ముదిగొండ: విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యం, క్రమశిక్షణ అవసరమని రిటైర్డ్ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. ముదిగొండ మండలం బాణాపురంలో ఆవుల అమ్మిరెడ్డి స్కాలర్‌షిప్ పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. మొదట బాణాపురం జెడ్పీఉన్నత పాఠశాలను సందర్శించి, స్కూల్ అసెంబ్లీకి హాజరైయ్యారు. గ్రామస్తులు కోలాట, డప్పు బృందంచే మేళ్ల తాళ్లాలతో ఘన స్వాగతం పలికారు. ముదిగొండ మండలంలోని 15 జెడ్పీ ఉన్నత పాఠశాలలకు పదో తరగతిలో టాపర్‌గా నిలిచిన, వివిధ తరగతులకు చెందిన 71మంది విద్యార్థులకు రూ. 8.49లక్షలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణతో పాటు రిటైర్డు ఐఆర్ఎస్ అధికారి ఆవుల భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. స్కాలర్‌షిప్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మనం సహాయం పొందుతూ, ఇతరులకు సహాయకారిగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ జనార్ధన్‌రెడ్డి, ఎంఈఓ రామాచారి, ఎస్ఐ గజ్జెల నరేష్, బాణాపురం జెడ్పీఉన్నత పాఠశాల హెచ్‌ఎం వెంకట్రామిరెడ్డి, గ్రామస్తులు, బాణా డెవలప్‌మెంట్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



ట్రిపుల్‌ఐటీలో సీటు సాధించిన విద్యార్థులతో సాధిక్ అలీ

కల్లూరు: బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన నలుగురు విద్యార్థులకు తోపుడుబండి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆర్థిక సాయం అందించారు. బాలికోన్నత పాఠశాల నుంచి షేక్.సారియా, షేక్.సుమయ్య, బిల్లుపాడు ఉన్నత పాఠశాల నుంచి కొల్లిపాక కోటేశ్వరి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి కంచు భవిష్‌లకు పదివేల రూపాయలు చొప్పున తోపుడుబండి ఫౌండేషన్ నిర్వాహకుడు ఎస్‌కే సాధిక్ అలీ అందచేసారు. ఈ ఆరేళ్ల పాటు విద్యార్థులకు అయ్యే ఖర్చును తోపుడుబండి ఫౌండేషన్ అందజేయనున్నట్లు పేర్కొంది. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పత్తిపాటి నివేదిత, మేడరాజు శ్రీనివాస్, బిల్లుపాడు హెచ్‌ఎం భోజన్న, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ పసుపులేటి వీరరాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఐటీలో విద్యార్థి ప్రతిభ

ఎర్రుపాలెం: మండలంలోని రేమిడిచర్ల గ్రామానికి చెందిన విద్యార్థి గరికపాటి సుమంత్ ఎన్ఐటీలో అత్యుత్తమ మార్కులు పొంది వరంగల్ కళాశాలలో సీటు సాధించారు. శనివారం రేమిడిచర్ల గ్రామంలో విద్యార్థి సుమంత్‌ను కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన నాయకులు శాలువలతో ఘనంగా సత్కరించి అభినంధించారు. కార్యక్రమంలో రమేష్, బాబురావు, శ్రీనివాసరావు, రత్నాకర్, వేణు, లోకేశ్వరరావు, బాబురావు, పుష్పరాజు, శ్రీను, చిట్టిబాబు, తదితరులున్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి టీవీ బహూకరణ

చింతకాని: మండలంలోని కొదుమూరు గ్రామంలోని కొత్తూరు అంగన్‌వాడీ కేంద్రానికి గ్రామానికి చెందిన పెంట్యాల సురేష్ ఎల్ఈడీ టీవీని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చేటువంటి పిల్లలకు పోషకాహారాన్ని అందిస్తూ విద్యాబుద్దులు నేర్పించాలని తెలిపారు. ఈ సందర్భంగా సురేష్‌ను అంగన్‌వాడీ సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు అప్పారావు, అంగన్‌వాడీ టీచరు గౌషా బేగం తదితరులు పాల్గొన్నారు.

బేబీ చైర్స్..

వైరారూరల్: మండలంలోని తాటిపూడి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి ఏనుగు రాఘవయ్య 33వ వర్ధంతి వేడుకలను పురస్కరించుకోని అతని కుటుంబ సభ్యులు సన్‌రైజ్ అభ్యుదయ సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం బేబీ చైర్స్, టేబుల్ ర్యాక్, వాటర్ క్యాన్ తదితర సామగ్రిని అందించారు. కార్యక్రమంలో కల్లూరు ఎంపీఓ ఏనుగు సురేష్, సంస్థ బాధ్యులు ఏనుగు సుమన్, మాలతిదాస్, ఏనుగు శివరాఘవ, దాస్, సుభానీ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మాలతి తదితరులు పాల్గొన్నారు.

బీరువాలు వితరణ..

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో శనివారం 8 అంగన్‌వాడీ కేంద్రాలకు బీరువాలను వితరణగా అందజేశారు. మారెళ్ల గౌతమ్ సూర్య పుట్టిన రోజు సందర్భంగా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు లక్ష రూపాయలు విలువ చేసే బీరువాలను కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు మారెళ్ల లక్ష్మణ్‌రావు, మాజీ సర్పంచ్ మారెళ్ల మమత చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో, జెడ్పీ పాఠశాలలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మారెళ్ల మల్లిఖార్జున్‌రావు, మారెళ్ల వెంకటయ్య, మాజీ ఎంపీటీసీ తాళ్ల జోసఫ్, మారెళ్ల మోహన్‌రావు, కార్యదర్శి వేణు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

ఏన్కూరు: మండలంలోని తిమ్మారావుపేట ఓం ఆదిత్య గాయత్రి పాఠశాలకు చెందిన 11 మంది విద్యార్థుల తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాలకు కోసం రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం ఏన్కూరు రైతువేదికలో జరిగిన కార్యక్రమంలో అధికారులు విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి జయరాజు, ప్రిన్సిపాల్ రమేష్, గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

శిక్షణా తరగతులను జయప్రదం చేయండి

సత్తుపల్లిరూరల్: ఈ నెల 13,14వ తేదీల్లో మధిర పట్టణంలో జరిగే ప్రగతిశీల యువజన సంఘం పీవైఎల్ రాజకీయ శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి రాకేష్ అన్నారు. సత్తుపల్లి మండలం రుద్రాక్షపల్లిలో ఏర్పాటు చేసిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. యువతను సక్రమ మార్గంలో నడపాల్సిన పాలకులే సక్రమంగా లేరని తెలిపారు. ఈ సమావేశంలో పీవైఎల్ కల్లూరు డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు దుంపా కామేష్, సంగం అరుణ్‌కుమార్, నాయకులు యాదగిరి, భత్, సాయి, ఆనంద్‌పాల్గొన్నారు.

ప్రభాకర్ కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలి

చింతకాని: భూ వివాదంతో ఆత్మహత్య చేసుకున్న రైతు బోజెడ్ల ప్రభాకర్ కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని ప్రొద్దుటూరు గ్రామంలో ప్రభాకర్ కుటుంబాన్ని పరామర్శించడంతో పాటు.. పొలాన్ని పరిశీలించారు. పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకటేశ్వరరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాంబాబు, సీపీఎం మండల కార్యదర్శి గోపాలరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.